
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3

అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 8 జూలై 2024


తుంగభద్ర డ్యాంలో నీటినిల్వ

తుంగభద్రకు వేగంగా..

జలాశయానికి ఒకేరోజు ఐదు టీఎంసీల నీరు
18.249 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ

బొమ్మనహళ్, జూలై 7: తుంగభద్ర జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గత రెండు రోజులుగా తుంగభద్రకు వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. ఆదివారం ఒక్క రోజే ఐదు టీఎంసీలు నీరు వచ్చి చేరింది. దీంతో జలాశయంలో నీటి నిల్వ 18 టీఎంసీలకు చేరుకుంది. గత శుక్రవారం 19,201 క్యూసెక్కులు, శనివారం 25,556 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం ఉదయానికి 50,175 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి మట్టానికి గాను 18.249 టీఎంసీల నీటి నిల్వ నమోదైంది. ఔట్ ఫ్లో 263 క్యూసెక్కులుగా ఉంది. జలాశయానికి ఎగువన ఉన్న శివమొగ్గ నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. డ్యాంలోకి వరదప్రవాహం పెరుగుతుండటం పట్ల బొమ్మనహళ్, కణేకల్లు ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈసారి జలాశయానికి ముందు గానే వరద నీరు వచ్చి చేరుతోంది. గతేడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 3.081 టీఎంసీల నీరు మాత్రమే ఉండేది. 302 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 249 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉండేదని బోర్డు అధికారులు తెలిపారు.

తగ్గిన టమోటా ధర



అనంతపురంరూరల్, జూలై7: కక్కలపల్లి మార్కెట్‌లో టమోటా ధరలు తగ్గాయి. గత నాలుగైదు రోజులు కిలో గరిష్ఠ ధరలు రూ.35పైన పలుకుతూ వచ్చాయి. ఆ ధర ఆదివారం రూ.30కి పడిపోయింది. కిలో సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ.18తో పలికినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మొత్తంగా మార్కెట్‌లోని మండీలకు 60 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు.

గోరంత పెట్టి.. కొండంత దోచేశారు

జగనన్న కాలనీల భూసేకరణలో అక్రమాలు

లక్షల ప్రజాధనం కొల్లగొట్టిన వైసీపీ నాయకులు

అనువుగాని చోట జగనన్న లేఅవుట్‌లు


ముళ్ల పొదలతో హోతూరు లేఅవుట్
చాబాల లేఅవుట్‌లో పూర్తయిన ఒకే ఒక ఇల్లు

ఉరవకొండ, జూలై 7: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు భూ సేకరణ పేరుతో రూ.కోట్లు దోచేశారు. వైసీపీ నాయకులు ముందుగానే ప్రైవేట్ వ్యక్తుల నుంచి తక్కువ ధరలకే భూమిని కొనుగోలు చేసి, దాన్ని భూసేకరణలో భాగంగా ఎక్కువ రేటుకు ప్రభుత్వానికి అప్పగించారు. పట్టణంలోని పేదల కోసం చాబాల రోడ్డులో ఐదెకరాలు, హోతూరు రోడ్డులో రెండెకరాలు, గురుకుల పాఠశాల సమీపంలో నాలుగెకరాల భూమిని వైసీపీ ప్రభుత్వంలో సేకరించారు. మూడేళ్ల కిందట పట్టణ శివారులోని చాబాల-హోతూరు, జీఎంసీ బాలయోగి గురుకుల పాఠశాల ప్రాంతంలో 603మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వైసీపీ నాయకులకి లబ్ధి చేకూర్చేందుకు ఎకరా రూ.ఐదు లక్షలు కూడా చేయని భూమిని, ఇళ్లస్థలాల కోసం ఎకరా భూమిని ప్రభుత్వం రూ.28లక్షలకు కొనుగోలు చేసింది. అక్కడ జగనన్న లేఅవుట్‌లో 269మందికి పట్టాలు ఇచ్చారు. గరుకుల పాఠశాల సమీపంలో మూడు నెలల కిందటే కొందరి నుంచి భూమిని కొనుగోలు చేశారు. వారికి ఎకరాకు రూ.8లక్షలు ఇచ్చి ప్రభుత్వానికి మాత్రం ఎకరా రూ.32లక్షలకు విక్రయించారు. ఇక్కడ అంతా తెలిసినా అధికారులు అధిక ధరలు చెల్లించి భూసేకరణ చేయడం గమనార్హం. చాబాల- హోతూరు రోడ్డులో సేకరించిన భూమి ఇళ్లు నిర్మించడానికి అనువుగా లేదు. దీంతో మూడేళ్లలో ఒక ఇల్లు మాత్రమే నిర్మించారు.

విచారణ చేపట్టాలి



జగనన్న కాలనీల భూసేకరణపై సమగ్ర విచారణ చేపట్టాలి. గత వైసీపీ ప్రభుత్వం ఆ పార్టీ నాయకులకు లబ్ధి చేకూర్చేలా భూసేకరణ చేసింది. ఎకరా రూ. ఐదు లక్షలు చేయని భూములకు రూ.30 లక్షలు చెలించారు. ప్రజా ధనాన్ని అప్పనంగా కొల్లగొట్టారు.

- ప్రభాకర్, వార్డుసభ్యుడు

అనువుగాని చోట ఇళ్ల పట్టాలు



జగనన్న కాలనీల పేరుతో లబ్ధిదారులకు అనువుగాని చోట ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. పట్టణానికి 2.కి.మీ దూరంలో, శ్మశానానికి దగ్గరలో పట్టాలు పంపిణీ చేయడం వల్ల లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ఆసక్తి చూపడం లేదు. హోతూరు లేఅవుట్‌లో వర్షాలు వస్తే నీరు నిల్వ ఉంటోంది.

- గోవిందు, ఉరవకొండ

పోటాపోటీ..!

డ్వామా, డీఆర్‌డీఏ పీడీ పోస్టుల కోసం ఆశావహుల యత్నం


డీఆర్‌డీఏ కార్యాలయం

రేసులో పలువురు డీఎల్‌డీఓలు
అధికార పార్టీ నేతల ప్రసన్నం కోసం పాట్లు



డ్వామా కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 7: డీఆర్‌డీఏ, డ్వామా పీడీ పోస్టుల కోసం ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారిని పీడీలుగా నియమించారు. సుమారు ఐదేళ్లు ఆ ఇద్దరే పీడీలుగా కాలం గడిపేశారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిద్దరూ సొంతశాఖలకు వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ ఇప్పటికే 15రోజులు సెలవులో వెళ్లారు. డ్వామా పీడీ తన సొంత శాఖ జైళ్ల శాఖకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలకు ఇద్దరు పీడీలు అంటకాగి అవినీతి ఆరోపణలు మూటగట్టుకున్నారు. ఇక ఇద్దరు పీడీలు వెళ్లిపోతే...రెండు పోస్టులు ఖాళీ అవుతాయి. ఈ క్రమంలో ఆశా వహులు రెండు పోస్టుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పీడీ పోస్టుల కోసం ప్రయత్నించిన వారు ఈ దఫా ఎలాగైనా సాధించుకోవాలనే లక్ష్యంతో గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో డీఆర్‌డీఏ, డ్వామా రెండూ శాఖలు కీలకమే. అలాంటి ప్రాధాన్యం గల శాఖల్లో పాగా వేసేందుకు ఎంపీడీఓలు, డీఎల్‌డీఓలు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో సముచిత స్థానంలో పనిచేసిన వారు సైతం కూటమి ప్రభుత్వంలో మెరుగైన స్థానం సాధించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంలోని కీలక నేతలను కలిసి ప్రసన్నం చేసుకునేందుకు అనేకరూపాల్లో ప్రయత్నాలు ప్రారంభించారు. నేతలను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేయడం, అభినందనలు తెలుపడంతో మొదలెట్టి...తమకు, ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం కల్పించాలని సుతిమెత్తని మాటలతో ఆకట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.

తీవ్ర పోటీ

ఇదివరకు ఎంపీడీఓలే డ్వామా, డీఆర్‌డీఏ పీడీ పోస్టులకు ఎక్కువగా పోటీ పడేవారు. అయితే ఎంపీడీఓలకు డీఎల్‌డీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. వీరిలో గతంలో ఎస్సీ, బీసీ కార్పొరేషన్లలో పనిచేసి, ప్రస్తుతం జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారిగా పనిచేస్తున్న డీఎల్‌డీఓ డ్వామా పీడీగా రావాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే అవినీతి ఆరోపణలు ఉండటం ఇతడికి ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. ఆయన డ్వామాకు రావడంపై సిబ్బంది, అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. జడ్పీ డిప్యూటీ సీఈఓగా పనిచేసిన మరో డీఎల్‌డీఓ డ్వామాకు రావాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. గతంలో అనంతపురం ఎంపీడీఓగా పనిచేసిన డీఎల్‌డీఓ, జిల్లా సహకారశాఖలో పనిచేసిన ఓ అధికారి డ్వామా పీడీగా రావాలని ఆయా స్థాయిల్లో అధికారపార్టీ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉంటే డ్వామా అదనపు పీడీగా పనిచేస్తున్న మరో డీఎల్‌డీఓ రెగ్యులర్ పీడీగా తెచ్చుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేశారు. డ్వామాలో కీలక పోస్టులో ఉన్న మరో డీఎల్‌డీఓ కూడా డ్వామా పీడీగా నియామకం పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక జడ్పీ డిప్యూటీ సీఈఓగా పనిచేసిన డీఎల్‌డీఓ డ్వామా కాకపోతే డీఆర్‌డీఏ పీడీగా రావాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా ఉన్న ఏపీడీ కూడా రెగ్యులర్ పీడీగా చేసుకోవాలని అధికారపార్టీ నేతలను కలిసి మద్దతు కూడగట్టుకుంటున్నట్లు సమాచారం. ఏది ఏమైనా డ్వామా, డీఆర్‌డీఏ పీడీలుగా ఎవరిని నియమిస్తారనే ఉత్కంఠ ఆయా శాఖల్లో కొనసాగుతోంది.

వైసీపీ నాయకుల మట్టి దందా

'ఉపాధి' గుంతల మట్టిని సైతం తోడేసి విక్రయం


వంకలో మట్టిని ట్రాక్టర్‌లో నింపుతున్న ఎక్స్‌కవేటర్

యాడికి, జూలై 7: మండలంలో వైసీపీ నాయకుల మట్టిదందాకు అడ్డు అదుపులేకుండా పోయింది. యాడికిలోని వేములపాడు రోడ్డులో ఆదివారం అక్రమంగా మట్టిని తరలించి విక్రయాలు జరిపారు. స్థానిక మరువ వంకలో ఉపాధిహామీ పథకం కింద ఫారంపాండ్ తవ్వారు. ఆ మట్టిని సైతం ఎక్స్‌కవేటర్ల ద్వారా ట్రాక్టర్‌లో నింపి రూ.వెయ్యికి విక్రయించేశారు. ఆదివారం సెలవు రోజు కావడం, అధికారులు ఎవరూ అటువైపు రాకపోవడంతో వైసీపీ నాయకుల మట్టి దందా యథేచ్ఛగా సాగింది. ఒక్క రోజులోనే దాదాపు వంద ట్రాక్టర్ల మట్టిని తరలించేశారు. యాడికిలోని భైరవకొండ, మరువ వంకలో తరచూ మట్టి మాఫియా చెలరేగిపోతుండటంపై స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఎవరైనా రైతులు తమ పొలాలను సారవంతం చేసుకోవడానికి మట్టిని తరలిస్తుంటే ఆ వాహనాలను అధికారులు సీజ్ చేస్తున్నారు కానీ మట్టి మాఫియాను మాత్రం అడ్డుకోలేకపోతున్నారని వారు విమర్శిస్తున్నా రు. ఉపాధిహామీ పథకంలో భాగంగా ఫారం పాండ్‌ల వద్ద తవ్విన మట్టిని సైతం తరలిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


గురువులకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్న జైన మహిళలు

'అనంత'కు చేరిన జైన గురువులు

అనంతపురం కల్చరల్, జూలై 7: చాతుర్మాస దీక్షలు చేపట్టేందుకు జైన మత గురువులు అనంతపురం చేరుకున్నారు. బళ్లారిలో శనివారం బయలుదేరిన జైనగురువులు ప్రభాశ్రీ, రోషన్‌జీ ఆదివారం సాయంత్రం అనంతపురం నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బళ్లారి బైపాస్ రోడ్డు నుంచి కమలానగర్‌లోని జైనమందిరం వరకు గురువులను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఊరేగింపు ముందు జైనులు నృత్యాలు చేస్తూ ముందుకు కదిలారు. జైన గురువులు ఇక్కడి జైన మందిరంలో 41 రోజులపాటు దీక్ష సాగించనున్నారు.

మంచిరోజులు వస్తున్నాయ్..!

నేటి నుంచి ఉచిత ఇసుక విధానం
టన్ను రూ.195గా నిర్ధారించిన ప్రభుత్వం


ఇసుక లోడ్ చేస్తున్న కూలీలు (ఫైల్)

అనంతపురం క్లాక్‌టవర్/గుత్తి, జూలై 7: హమ్మయ్యా..! ఇంకేం భయం లేదు. ఇక నుంచి ఇసుక ఉచితంగా దొరుకుతుంది. భవన నిర్మాణ రంగం ఊపందు కుంటే తమకు చేతి నిండా పని దొరుకుతుందని భవననిర్మాణ కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తు న్నారు. కూటమి ప్రభుత్వం సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టనుంది. ఈ విధానాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్ర భుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఒక వ్యక్తి రోజుకు 20టన్నుల వరకు మాత్రమే ఉచితంగా ఇసుకను తరలించుకునే అవకాశం ఉంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని సోమవారం కూటమి ప్రభుత్వం ప్రారంభించనుంది. రాయదుర్గం మండలం జుంజురాంపల్లి స్టాక్ పాయింట్‌లో 58,160 మెట్రిక్ టన్నుల ఇసుక ఉన్నట్లు గుర్తించారు. ఇసుక కోసం వ్యక్తి నేరుగా స్టాక్ పాయింట్ దగ్గరకు ఆధార్‌కార్డు, మొబైల్ నంబరు, ఎక్కడికి తరలించాలనే వివరాలతో పాటు వాహనం వెళ్లాల్సి ఉంటుంది. తవ్వకం, లోడింగ్, సీనరీజ్‌తో కలిసి ఒక టన్ను ఇసుక ధరను రూ.195గా నిర్ధారించారు. అక్రమాలకు తావులేకుండా ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేస్తామని భూగర్భగనుల శాఖ డీడీ నాగయ్య తెలిపారు.

- జిల్లా ఇసుక కమిటీ ఆధ్వర్యంలో ఇసుక ధరలు నిర్ధారించారు. ఛైర్మన్‌గా కలెక్టర్, మెంబర్ కన్వీనర్‌గా భూగర్భ గనుల శాఖ డీడీ, సభ్యులుగా జాయింట్ కలెక్టర్, ఎస్పీ, సెబ్ అడిషినల్ ఎస్పీ, గ్రౌండ్‌వాటర్ డీడీ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లు, డీటీసీలు సభ్యులుగా ఉంటారు.

కార్మికుల హర్షం

ఉచిత ఇసుక విధానంపై భవన నిర్మాణ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇసుక ధరలు భారీగా ఉండటంతో భరించలేక భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయని, దీంతో తాము ఉపాధి కోల్పోయినట్లు వారు పేర్కొన్నారు. దీంతో కుటుంబ పోషణ భారమై కొందరు వలస వెళ్లగా, మరికొందరు అప్పులతో నెట్టుకొచ్చినట్లు తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయనుండటంతో భవన నిర్మాణ రంగం పుంజుకునే అవకాశం ఉన్నట్లు వారు వెల్లడించారు. ఇక తమకు మంచి రోజులు వచ్చినట్లేనని వారు సంతోషం వ్యక్తం చేశారు.

ఉపాధి లేక ఇబ్బందులు పడ్డాం



గత వైసీపీ ప్రభుత్వ విధానలతో ఇసుక ధర భారం అయ్యింది. దీంతో పట్టణంలో భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇసుక ధర ఎప్పుడు ఎంత ఉంటుందో తెలియని పరిస్థితి ఉండేది. అందుకే భవన నిర్మాణ పనులు నిలిపివేయాల్సిన పరిస్థితి వచ్చింది. పనులు లేక పోవడంతో అనేక మంది కూలీలు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక అందిస్తామని చెప్పడంతో భవన నిర్మాణపనులు ఊపందుకుంటాయి.

-వెంకటరాముడు, బేల్దారి, గుత్తి

పనులు దొరికేవి కావు



గత ప్రభుత్వ హయాంలో పనులు దొరకడం కష్టంగా ఉండేది. ఇసుక దొరక్కపోవడంతో భవనాలు నిర్మించడానికి యాజమానులు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో మాకు కూడా పనులు దొరికేవి కావు. ఇకపై ఈ సమస్య ఉండ దు. ఉచిత ఇసుక విధానం అమలులో వస్తే రోజు పనులు దొరుకుతాయి.

- కృష్ణమూర్తి, భవన నిర్మాణ కూలీ, గుత్తిఆర్ఎస్

పస్తులుండాల్సిన అవసరం లేదు



కూటమి ప్రభుత్వ నిర్ణయంతో కార్మికుల కుటుంబాలు పస్తులు ఉండాల్సిన అవసరం ఉండదు. ఇసుక కొరతతో నిర్మాణాలు నిలిచిపోవడంతో మా లాంటి కార్మికులు చాలా ఇబ్బంది పడ్డాం. పనులు లేక ఇల్లు గడిచేది కాదు. భవన నిర్మాణ పనులు జరగకపోతే దానిమీద ఆధారపడ్డ ఎలక్ట్రీషియన్, టైల్స్, పెయింటర్లు, కార్పెంటర్ పనులు చేసే వారికి కూడా ఉపాధి ఉండదు. ప్రస్తుతం ఉచిత ఇసుక విధానం అమలులోకి వస్తుండటంతో పనులు దొరుకుతాయి.

- నాగరాజు, కార్పెంటర్, గుత్తి

వైభవంగా ప్రథమ దర్శనం

ప్రారంభమైన గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు

దర్శనమిస్తున్న గూగూడు కుళ్లాయి స్వామి


నార్పల, జూలై 7: మతసామరస్యానికి ప్రతీకగా నిలచిన గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం వైభవంగా జరిగింది. కుళ్లాయి స్వామి పీరును పెట్టెలో నుంచి బయటకు తీసి పసుపు, గంధం, పన్నీరు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రథమ దర్శనం కావడంతో తాడిమర్రి, యల్లనూరు, శింగనమల, బుక్కరాయసముద్రం, బత్తలపల్లి, తదితర మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు గూగూడుకు చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ కార్యదర్శి శోభ, దేవదాయ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



విజేత కృష్ణా జట్టు



రన్నరప్ సెంట్రల్ జోన్ జట్టు

సౌత్‌జోన్ క్రికెట్ పోటీల విజేత కృష్ణా

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 7: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-19 మహిళల క్రికెట్ పోటీల విజేతగా కృష్ణా జిల్లా జట్టు నిలిచింది. ఆదివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో కృష్ణా, విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. విశాఖపట్నం 47ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. హితేసిని 71పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కృష్ణా జట్టు 19ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 126పరుగులు సాధించింది. వర్షం రావడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి మేరకు కృష్ణా జట్టును విజేతగా ప్రకటించారు. మెహకా 53పరుగులు చేసింది. సెంట్రల్‌జోన్, అనంతపురం జట్లు తలపడగా అనంతపురం నిర్ణీత 50ఓవర్లలో 6వికెట్లకు 177పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన సెంట్రల్ జోన్ 14.2ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 95పరుగులు చేసింది. వర్షం కారణంగా డక్‌వర్త్‌లూయిస్ పద్ధతి మేరకు సెంట్రల్ జోన్ జట్టును విజేతగా ప్రకటించారు. మరోమ్యాచ్‌లో నార్త్‌జోన్, సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. సౌత్‌జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన నార్త్‌జోన్ 33.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 164పరుగులు చేసింది. పాయింట్ల ఆధారంగా కృష్ణా జట్టు విజేతగా, సెంట్రల్ జోన్ ద్వితీయ స్థానంలో, తృతీయస్థానంలో విశాఖపట్నం, నాలుగో స్థానంలో అనంతపురం, ఐదో స్థానంలో నిలిచాయి. నార్త్‌జోన్, సౌత్‌జోన్ జట్లను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మహిళా సెలెక్షన్ కమిటీ చైర్మన్ ప్రసాద్ ప్రకటించారు. కార్యక్రమంలో సెలెక్షన్ కమిటీ సభ్యులు దివ్య, తులసీరాం లక్ష్మీ, క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి మధు ఆచారి పాల్గొన్నారు.

30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు



మాట్లాడుతున్న నరసింహులు

అనంతపురం విద్య, జూలై 7: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ ఆలస్యమైతే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం ఉపాధ్యాయభవన్‌లో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. జీవో 117ను రద్దు చేయాలన్నారు. ప్రైమరీ స్కూళ్లను 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలుగు, హిందీ స్కూల్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతుల సమస్యను పరిష్కరించాలన్నారు. జూన్, జూలై నెలల్లో అనేక మంది టీచర్లు రిటైర్డ్ అయ్యారని, వారి పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు రమణ, సర్దార్ వలి, ఆడిట్ కమిటీ కన్వీనర్ వన్నప్ప, నాయకులు పుల్లయ్య, హిమగిరి ప్రసాద్, రామమూర్తి, నారాయణస్వామి పాల్గొన్నారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు



యూపీఎస్సీ పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టరు

అనంతపురం టౌన్, జూలై 7: జిల్లాలో ఆదివారం యూపీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. ఉదయం జరిగిన ఈపీఎఫ్ఓ పరీక్ష ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలోని రెండు కేంద్రాల్లో నిర్వహించారు. 434మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా.. 117మంది రాసినట్లు కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఈఎస్ఐసీ పరీక్షను 6 కేంద్రాలలో నిర్వహించారు. పరీక్షకు మొత్తం 2,109మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా.. 1712 మంది వచ్చారు. పరీక్షా కేంద్రాలను కలెక్టరు తనిఖీ చేశారు.

చర్చకు సిద్ధమా...!



- ఆరు మాసాల తర్వాత జడ్పీ సర్వసభ్య సమావేశం
- కొత్త ప్రభుత్వంలో తొలిసారి...
- 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు కూటమివారే..
- వస్తే... వేదికపైకి ముగ్గురు మంత్రులు
- మారిన సమీకరణాల నేపథ్యంలో సభపై అందరి దృష్టి
- పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు టీడీపీలోకి..
- వైసీపీ ఎమ్మెల్యేలకు దోచిపెట్టిన అధికారులు
- రూ.ఆరు కోట్లకుపైగా అక్రమ బిల్లులు
- రేపటి మీటింగ్‌పై సర్వత్రా ఉత్కంఠ

అనంతపురం విద్య, జూలై 7: నాడు అంతా ఏకపక్షం. సభ్యుల్లో 99 శాతం వైసీపీ వారే. దీంతో చర్చలు, తీర్మానాలు అంతా మూసధోరణే. కాలం మారింది. రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో జడ్పీలో సంఖ్యాబలం పెరిగింది. తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలతోపాటు, పార్లమెంట్ సభ్యులు మరికొందరు టీడీపీ, బీజేపీ పక్షాన జడ్పీటీసీలు, ఎంపీపీలు వెళ్లడంతో వైసీపీ సంఖ్యా బలం తగ్గిపోయింది. దీంతో 9న జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంపైనే అందరికీ దృష్టి ఉంది. కొందరు వైసీపీ ఎమ్మెల్యేలకు జడ్పీలోని కోటరీగా మారిన అధికారులు కోట్ల రూపాయలు దోచిపెట్టారు. పుట్టపర్తి, మడకశిర మాజీ ఎమ్మెల్యేలకు చెందిన కొన్ని బినామీ సంస్థలకు రూ.4 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకూ బిల్లులు అడ్డగోలుగా దోచిపెట్టినట్లు విమర్శలు వచ్చాయి. దీనిపై విచారణ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో సభలో కూటమి ప్రభుత్వ సభ్యుల బలం పెరిగిన నేపథ్యంలో చర్చలు ఆసక్తికరంగా, రసవత్తంగా ఉంటాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

సమావేశాలంటే లెక్కలేదు...

జడ్పీలో సమావేశాలు నిర్వహణ అంటే లెక్కలేకుండా పోయింది. చట్టాలను తొక్కేసి, సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి 17న సమావేశం నిర్వహించారు. 90 రోజుల అనంతరం సమావేశం నిర్వహించాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికల కోడ్‌కు అటు, ఇటుగా కడప ఇతర జిల్లాల్లో కూడా సమావేశాలు నిర్వహించారు. అయితే ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాత్రం జడ్పీ అధికారులు సాకులు చూపుతూ సమావేశం నిర్వహించలేదు. నిర్ణీత గడువు ముగిసిన 2 మాసాల తర్వాత 9న మళ్లీ సమావేశం నిర్వహించబోతున్నారు. అయితే జడ్పీ సర్వసభ్య సమావేశాలకు నడుమ స్టాండింగ్ కమిటీ సమావేశం కూడా నిర్వహించాలి. అయితే ఫిబ్రవరిలో ఒక స్టాండింగ్ నిర్వహించినా.. జడ్పీ అధికారుల వైఖరి బహిష్కరిస్తూ సభ్యులు వాయిదా వేశారు. వాయిదా పడిన మరుసటి రోజే స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఆ సంప్రదాయాన్ని కూడా అధికారులు పాటించలేదు. దీంతో ఇక్కడ సమావేశాల నిర్వహణ, చట్టాల అమలు బుట్టదాఖలు చేశారు. గత సమావేశాల్లో చేసిన తీర్మానాల అమలులో జడ్పీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ వచ్చారు. దీంతో జడ్పీ మీటింగ్, స్టాండింగ్ కమిటీలు నిర్వహిస్తే ఎక్కడ సభ్యులు తమను ప్రశ్నిస్తారన్న సాకుతో వాయిదా వేస్తూ వస్తున్నారు. పాలకవర్గాన్ని ధిక్కరించేలా వ్యవహరిస్తూ వస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

కూటమి ప్రభుత్వంలో తొలిసభ

రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత తొలిసభ 9న జరగనుంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఈ క్రమంలో ఎన్నికల ముందు, తర్వాత పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు పార్టీలు మారారు. ఇప్పటికే పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు టీడీపీతోపాటు, బీజేపీలో చేశారు. దీనికితోడు కొత్తగా ఎంపికైన 14 మంది ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్లమెంట్ సభ్యులు సభలో అడుగుపెట్టనున్నారు. మారిన పరిణామాల నేపథ్యంలో నాడు ప్రతిపక్షం వైపు ఉండాల్సిన టీడీపీ సభ్యుల బలం పెరిగినట్టేనని చెప్పాలి. ఇప్పుడు సభ్యుల్లో కీలకంగా మారిన ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీల నేపథ్యంలో చర్చలు రసవత్తంగా మారనున్నాయనడంలో సందేహం లేదు. ఉమ్మడి జిల్లా కావడంతో ముగ్గురు మంత్రులు, ఇద్దరు కలెక్టర్లతో వేదిక కళకళలాడనుంది.

విచారణ సాగేనా?

జడ్పీలో ఈ రెండున్నరేళ్ల కాలంలో కొందరు జడ్పీ ఉన్నతాధికారులు వైసీపీ ప్రజాప్రతినిధులకు కోట్ల రూపాయలు దోచిపెట్టారు. వైసీపీకి చెందిన పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే, మడకశిర ప్రాంతానికి చెందిన మరో మాజీ ప్రజాప్రతినిధి బినామీ కాంట్రాక్టర్లకు ఇష్టారాజ్యంగా బిల్లులు చేశారు. జడ్పీలో ఉన్నతాధికారిగా పనిచేసి వెళ్లిన ఓ ఉన్నతాధికారి హయాం నుంచే అడ్డగోలుగా బిల్లులు చేస్తూ వచ్చారు. విచారణలో ఉన్నా బిల్లులు చేశారు. వైసీపీ వాళ్లంటే ఎక్కడలేని ప్రేమ చూపిస్తూ రాత్రికి రాత్రే సదరు అధికారి ఆధ్వర్యంలో కోట్ల రూపాయలు బిల్లులు చెల్లించారు. ఖరీదైన సెల్‌ఫోన్, కమీషన్ల కోసం సదరు ఆఫీసర్ బాగానే లాగేశారంటూ జడ్పీ ఉద్యోగులే చెబుతున్నారు. తర్వాత వచ్చిన ఉన్నతాధికారులు సైతం ఆయన చెప్పినట్లు తలలు ఊపడంతో వైసీపీ నాయకులకు అక్రమ బిల్లుల పంట పడింది. రూ.4 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకూ ఈ స్కాం సాగినట్లు విమర్శలు వస్తున్నాయి. కొత్త ప్రభుత్వంలోనైనా కొందరు వైసీపీ వీర విధేయ అధికారుల అక్రమాలపై విచారణ చేయంతోపాటు, అదుపు తప్పిన జడ్పీ, స్టాండింగ్ కమిటీ నిర్వహణపై, జిల్లాలో నెలకొన్న సమస్యలపై చర్చలు ఎంతైనా అవసరం. కూటమి ప్రభుత్వంలో తొలిసారి జరిగే జడ్పీ మీటింగ్‌పై అందరి దృష్టి ఉంది.

రానున్న మూడురోజుల్లో తేలికపాటి వర్షసూచన

బుక్కరాయసముద్రం, జూలై 7: పశ్చిమ, దక్షిణ మధ్య బంగాళాఖాత తీరంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజుల్లో తేలిక పాటి వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. పలు చోట్ల ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులతో వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. గాలులు గంటకు 30-40 కిలోమీటర్లు వేగంతో వీచే అవకాశం ఉందన్నారు.

జిల్లా హ్యాండ్‌బాల్ కమిటీ ఏర్పాటు

కదిరిఅర్బన్, జూలై 7: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో జిల్లా హ్యాండ్‌బాల్ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు విజయకుమార్ తెలిపారు. జిల్లా ఉపాధ్య క్షులుగా ఫక్రుద్దీన్, కార్యదర్శి మహేష్, కోశాధికారి వంశీ, జాయింట్ సెకటరీ ప్రసన్న కుమార్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశామన్నారు. ఎంపికైన కమిటీకి పలువురు అభినందనలు తెలియజేశారు.

ఆంధ్రా మహిళా క్రికెట్ ఆపరేషన్స్ మేనేజర్‌గా మచ్చా రామలింగారెడ్డి



అనంతపురం క్లాక్‌టవర్, జూలై 7: బీసీసీఐ అనుబంధంగా ఉన్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మహిళా క్రికెట్ ఆపరేషన్స్ మేనేజర్‌గా జిల్లాకు చెందిన మచ్చా రామలింగారెడ్డి నియమితుడయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మచ్చా రామలింగారెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.





నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన నృత్యరూపకం

పుట్టపర్తి, జూలై 7: స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఆదివారం బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన 'అవతారవైభవంలో ఆదిపర్వం' నృత్యరూపకం భక్తులను అలరింపజేసింది. సంగారెడ్డి జిల్లా భక్తుల సాంస్కృతిక కార్యక్రమాలు రెండోరోజూ కొనసాగాయి. అవతారవైభవంలో ఆదిపర్వం పేరిట ప్రదర్శించిన నృత్యరూపకం భక్తులను మైమరపింపజేసింది. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.87 లక్షలు

అనంతపురంరూరల్, జూలై 7: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.3.87 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2.51 లక్షలు, ఆదివారం ఎనుములు, ఎద్దులు, ఆవుల సంత ద్వారా రూ.1.36 లక్షలు వచ్చిందని తెలిపారు.

టమోటా సాగుకు రైతుల ఆసక్తి

- నారుకు భారీ డిమాండ్
- అమాంతం ధర పెంచేసిన నర్సరీల నిర్వాహకులు
- నాణ్యత ప్రశ్నార్థకం
- ఆందోళనలో అన్నదాతలు





నర్సరీలో పెంచుతున్న టమోటా నారు

కళ్యాణదుర్గం, జూలై 7: మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. సామాన్యులు కొనాలంటే ఆలోచించేంత స్థాయికి చేరాయి. ఈ ధరలే అన్నదాతను ఊరిస్తున్నాయి. ఇక టమోటా ధరలు చూస్తే టచ్ చేసి చూడు అంటున్నాయి. దీంతో టమోటా సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పొలాలను సిద్ధం చేసుకున్నారు. నారు కొందామని వెళితే విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీనిని నర్సరీల నిర్వాహకులు క్యాష్ చేసుకుంటున్నారు. అమాంతం నారు ధరలు పెంచేశారు. నాణ్యత కూడా ప్రశ్నార్థకమే. పెరిగిన ధరలు, నాణ్యతపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో ఈ సారి సుమారు 500 ఎకరాలకు పైబడి టమోటాలను సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. పంట సాగుకు సమాయత్తమవుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న నర్సరీల యజమానులు నారు ధరను అమాంతంగా పెంచేశారు. ఒక్కొక్క మొక్క రూ.50 పైసల నుంచి రూ.70 పైసలకు విక్రయిస్తున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలో 16కిపైగా నర్సరీలు వున్నాయి. వీటిలో అధిక శాతం వాటికి అనుమతులు లేవు. వాటిలో నారు ధరలు పెంచేశారు. ఇప్పటికే ఒక్కొక్క నర్సరీ లక్ష నుంచి మూడు లక్షల మొక్కల వరకు విక్రయించారు. వాటి యజమానులు ధర పెంచడంతోపాటు మొక్కల కొరత చూపుతున్నారు. నర్సరీల్లో కనీసం ఏ రకం మొక్కలు వేశారో కూడా పట్టించుకోకుండా రైతులు కొనుగోలు చేస్తున్నారు. దీనిని సొమ్ము చేసుకునేందుకు యజమానులు కల్తీకి తెరలేపారు. నకిలీ విత్తనాలతో టమోటా మొక్కలు పెంచుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం మూలంగా యేటా ఎంతో మంది రైతులు టమోటా పంట సాగు చేసి కనీస దిగుబడులు కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతుకు శాపం..

పంట సాగు సమయంలో నర్సరీల ద్వారా రైతులకు విక్రయించే మొక్కలు పరిశీలించి వాటిని రైతులు నాటు కోవడానికి అనువుగా ఉన్నాయా లేదా అని తెలియజేయాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో రైతులు యేటా తీవ్రంగా నష్టపోతున్నారు. నర్సరీలను పర్యవేక్షించే అధికారులే కరువయ్యారు. కనీసం పంటలు పెట్టే సమయంలోనైనా నర్సరీలపై అధికారుల పర్యవేక్షణ లేకపోతే రైతుకు మరిన్ని కష్టాలు తప్పవు. అధికారులు మామూళ్ల మత్తులో పడి నర్సరీలను తనిఖీ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని నర్సరీల్లో రైతులకు నాణ్యమైన మొక్కలు అందించేలా పర్యవేక్షించాల్సి వుంది.

నాణ్యమైన మొక్కలు అందించాలి



రైతులకు నాణ్యమైన టమోటా మొక్కలు అందిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం నర్సరీల్లో ఎలాంటి రకాలు ఇస్తున్నారో కూడా తెలియదు. అదును దాటడంతో టమోటా సాగుకు అష్టకష్టాలు పడుతున్నాం. పెట్టుబడులు ఎక్కువవుతున్నాయి. పంట చేతికొచ్చే సమయానికి ధరలు ఆశాజనకంగా వుంటేనే ఆర్థికంగా నిలదొక్కుకుంటాం. లేదంటే మరోసారి నష్టాలు తప్పవు.

-బొమ్మయ్య, రైతు, కరిగానపల్లి, కుందుర్పి మండలం

ధర.. రైతుకు అందుబాటులో ఉండాలి



నర్సరీల్లో టమోటా నారు ధరలు రైతులకు అనుగుణంగా వుండాలి. డిమాండ్‌ను బట్టి ధర పెంచితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. పెట్టుబడులు విపరీతంగా పెరుగుతాయి. దీని ప్రభావం సాగు విస్తీర్ణంపై పడుతుంది. ఇప్పటికైనా నర్సరీల్లో నారు ధరలు పెంచకుండా రైతుకు తక్కువ ధరకే అందించేలా చర్యలు తీసుకోవాలి.

-ఈరణ్ణ, కరిగానపల్లి, కుందుర్పి మండలం

బదిలీలకు వేళాయె..!

- రెవెన్యూ శాఖలో బదిలీల టెన్షన్
- డీఆర్ఓ, ఆర్డీఓ పోస్టులకు నేతల కసరత్తు
- మండలాల కోసం తహసీల్దార్ల పైరవీలు
- డీటీలు, ఆర్ఐలదీ ఇదే పరిస్థితి..

అనంతపురం టౌన్, జూలై 7: ప్రభుత్వ పాలనలో అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖను ప్రస్తుతం బదిలీల టెన్షన్ పట్టుకుంది. రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం రెవెన్యూ అధికారుల బదిలీలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో ఐఏఎస్‌ల బదిలీలు చేపట్టింది. జాయింట్ కలెక్టర్లు, డీఆర్ఓలు, ఆర్డీఓలు, డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు సైతం రెండు, మూడు రోజుల్లో చేపట్టనున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. కీలకమైన జాయింట్‌కలెక్టర్, డీఆర్ఓ, ఆర్డీఓల పోస్టులపై జిల్లా అధికార పార్టీల నేతలు కసరత్తు చేసి ఓ కొలిక్కి తెచ్చినట్లు సమాచారం. ఈనేపథ్యంలోనే ప్రస్తుతమున్న జేసీ, డీఆర్ఓ, ఆర్డీఓలు ఇక్కడి నుంచి బదిలీ అవుతారని పేర్కొంటున్నారు. ఇప్పటికే జిల్లాకు చెందిన ఓ కీలక ప్రజాప్రతినిధి ఏ జిల్లాకు వెళ్లాలనుకున్నారో ఆ జిల్లాకు రెకమెండ్ చేస్తానని ప్రస్తుత జేసీకి హామీ ఇచ్చినట్లు మాట్లాడుకుంటున్నారు. దీనిని బట్టి చూస్తే జేసీ బదిలీ ఖాయమనిపిస్తోంది. ఆయన వెళితే జాయింట్ కలెక్టరుగా ఎవరు వస్తారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదంటున్నారు.

డీఆర్ఓ సైతం..

ప్రస్తుత డీఆర్ఓ రామకృష్ణారెడ్డి బదిలీ కూడా ఖాయమనిపిస్తోంది. ఆయన స్థానంలో ఇదే జిల్లాలో నీటి పారుదల శాఖలో పనిచేస్తున్న ఓ మహిళా డిప్యూటీ కలెక్టరు డీఆర్ఓగా రానున్నట్లు సమాచారం. అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు ఆర్డీఓలకు స్థానచలనం తప్పదంటున్నారు. వీరి స్థానంలో డిప్యూటీ కలెక్టర్లుగా ఇటీవల ఉద్యోగోన్నతులు పొంది పక్క జిల్లాలకు వెళ్లిన హరినాథ్, విశ్వనాథ్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. మరో మహిళా అధికారి సైతం జిల్లాలోని ఓ డివిజన్‌కు ఆర్డీఓగా రావడానికి ప్రయత్నిస్తున్నట్లు చర్చించుకుంటున్నారు.

వారంలో సొంత జిల్లాకు తహసీల్దార్లు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో గతంలో ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్లు ఇతర జిల్లాలకు వెళ్లిన విషయం తెలిసిందే. ఇపుడు వారంతా మళ్లీ ఈ జిల్లాకు రానున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఫైలు సిద్ధం చేసి సీఎం ఆమోదం కోసం పంపినట్లు తెలిసింది. అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే రెండు మూడు రోజుల్లో తిరిగి సొంత జిల్లాలకు పంపే ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని రెవెన్యూ సంఘాల నాయకులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ వారంలో పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

ప్రాధాన్యం మేరకు పోస్టింగ్

తహసీల్దార్లు ఇక్కడకు వచ్చిన తర్వాత జిల్లా కలెక్టరు వారికి మండలాలు కేటాయించి పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంటుంది. ఇక్కడ ఆయా నియోజకవర్గాల అధికార పార్టీ నేతల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలు ఉంటాయి. ఈక్రమంలోనే తమకు అవసరమైన, అనుకూలమైన మండలాలలో పోస్టింగ్‌లు వేయించుకోవడం కోసం పలువురు పైరవీలు సాగిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి తమకు అవకాశం కల్పించాలని కోరుతూ లెటర్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేసుకుంటున్నారు. వీరిలో కొందరు గతంలో ఇక్కడ వైసీపీ నేతల అడుగులకు మడుగులు ఒత్తి, ఇష్టానుసారంగా అక్రమాలకు తోడ్పాటు అందించి, టీడీపీ శ్రేణులను, సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టారు. దీంతో టీడీపీ ప్రజాప్రతినిధులు సైతం ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఆ తహసీల్దార్లు మాత్రం ఇవన్నీ మామూలేనంటూ ఆయా ఎమ్మెల్యేలకు అత్యంత అనుకూలంగా ఉంటున్న మండలాల నాయకులకు ఎర వేసి వారి నుంచి పనిని సానుకూలం చేసుకునే యత్నాలు చేస్తున్నారు.



డీటీలు, ఆర్ఐల పైరవీలు

రెవెన్యూశాఖలో ఏపని జరగాలన్నా కిందిస్థాయి ఉద్యోగులు అనుకూలంగా ఉండాల్సి ఉంటుంది. అందుకే కిందిస్థాయి ఉద్యోగుల నియామకాలకు సైతం పెద్దఎత్తున పైరవీలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. 'మమ్మల్ని మీమండలానికి వేయించుకోండి మీరు చెప్పినట్లు చేసి పెడతాం' అంటూ కొందరు డీటీలు, ఆర్ఐలు ప్రజాప్రతినిధులు చుట్టూ తిరుగుతున్నారు. గతంలో ప్రభుత్వంలో వైసీపీ నేతలతో అంటకాగిన అధికారులు కూడా అపుడు వారు చెప్పినట్లు విన్నాం, చేశాం. ఇపుడు మీరు చెప్పినట్లు వింటాం, చేస్తాం అంటూ నేతల వద్ద విన్నవించుకుంటున్నారు. డీటీలు, ఆర్ఐలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పెద్దఎత్తున వస్తుండటంతో నేతలు సైతం ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో అర్థంకాక తలలు పట్టుకొని మీపేర్లు రాయించి పోండని చెప్పి పంపిస్తున్నారు.

నేటి నుంచి మొహరం ఉత్సవాలు



కొలువుదీరిన పీర్లు (ఫైల్)

బుక్కరాయసముద్రం, జూలై 7: మండలంలో హిందూ, ముస్లింలు కలిసి చేసుకునే మొహరం వేడుకలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రధానంగా బుక్కరాయసముద్రంలోని హజరత్ సయ్యద్ హరాస్సెన్, ఇమామ్ ఖాసీం, ఇమామ్ హరాస్సెన్, రెడ్డి పీర్లు, తరిమెల పీర్లు మకానాల్లో కొలువుదీరనున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లస్నగారి శ్రీనివాసులు అధ్వర్యంలో ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఉత్సవాల్లో భాగంగా 14న చిన్నసరిగెత్తు నిర్వహిస్తారు. పెద్ద సరిగెత్తు కార్యక్రమంలో భాగంగా పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చక్కెర చదివింపులు ఉంటాయి. 16న ఉదయం అగ్నిగుండ ప్రవేశం, 17న సాయంత్రం ఊరేగింపు, జలధి కార్యక్రమం ఉంటుంది. చెన్నంపల్లి, కొర్రపాడు, దయ్యాలకుంటపల్లి, వెంకటాపురం, సిద్ధరాంపురం, నీలంపల్లి తదితర గ్రామాల్లో పీర్ల పండగ ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు.

భక్తిశ్రద్ధలతో సాయిభిక్షాటన



భిక్షాటన చేస్తున్న సాయిభక్తులు

అనంతపురం కల్చరల్, జూలై 7: గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం మూడో రోడ్డు షిర్డీసాయి ఆలయం అధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో సాయిభిక్షాటన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీతోపాటు సాయిభక్తులు భజనలు చేస్తూ, ఇంటింటికీ తిరుగుతూ భిక్షాటన చేశారు. భిక్షాటనలో సేకరించిన సరుకులను గురుపౌర్ణమినాడు భక్తులకు అన్నదానానికి వినియోగించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి ఆభరణాల సమర్పణ

గార్లదిన్నె, జూలై 7: మండలంలోని కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు రూ.61,580 విలువ చేసే వెండి ఆభరణాలను సమర్పించారు. అనంతపురం పట్టణానికి చెందిన గొంది హేమంత్‌కుమార్, నాగలక్ష్మి దంపతులు ఆదివారం స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. అనంతరం రూ.61,580 విలువ చేసే 54 తులాల వెండి పంచ హారతులను అందచేసి మొ క్కులు తీర్చుకున్నారు. ఆభరణాలను ఆలయ ప్రధాన ఆర్చకులు రామాచార్యులకు అందచేశారు.



ఆలయ అర్చకుడికి వెండి ఆభరణాలు అందజేస్తున్న దాతలు

వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలి



విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శింగనమల, జూలై 7: ప్రభుత్వం వెంటనే సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాచేపల్లి సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రంలో ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ గతంలో పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మెటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని శిథిలావస్థలో ఉన్న వసతి గృహాలను వెంటనే మరమ్మతులు చేయించాలని, అద్దె భవనాల్లో నడుపుతున్న వాటికి నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయి, టోనీ, బాబాఫక్రుద్దీన్, గౌతమ్, గంగాధర్, ఆదిత్య పాల్గొన్నారు.

వైద్యుల క్రికెట్ పోటీల సెమీస్‌కు ఎంఆర్‌డీ సెక్షన్ జట్టు



విజయం సాధించిన ఎంఆర్‌డీ సెక్షన్ జట్టు

అనంతపురం టౌన్, జూలై 7: జిల్లా సర్వజన ఆస్పత్రి ఆధ్వర్యంలో పీటీసీ మైదానంలో కొనసాగుతున్న క్రికెట్ పోటీల్లో ఆదివారం ఎంఆర్‌డీ సెక్షన్ జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది. ఎంఆర్‌డీ సెక్షన్, జీజీహెచ్ లయన్స్ జట్ల మధ్య పోటీ రసవత్తరంగా సాగింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎంఆర్‌డీ సెక్షన్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 104 పరుగులు సాధించింది. అనంతరం బరిలోకి దిగిన జీజీహెచ్ లయన్స్ జట్టు 101 పరుగులు మాత్రమే చేసింది. దీంతో ఎంఆర్‌డీ సెక్షన్ జట్టు మూడుపరుగులు తేడాతో విజయం సాధించి సెమీస్‌కు చేరింది.

8 మందిపై కేసు నమోదు

పుట్లూరు, జూలై 7: మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన ఘర్షణ కేసులో ఇరువర్గాలకు సంబంధించి 8మందిపై కేసునమోదు చేసినట్లు ఆదివారం ఎస్ఐ హేమాద్రి తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో ఇరువర్గాలు కొట్టుకున్నట్లు తెలిపారు. మంజుల రాజుతోపాటు మరో ముగ్గురు, మరో వర్గంలో మంజుల నవీన్ తోపాటు ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. కాగా గ్రామంలో సీఐ సుబ్రహ్మణ్యం పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి

రాప్తాడు, జూలై 7: మండలంలోని బండమీదపల్లి పంచాయతీ వరిమడుగు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చవల నల్లప్ప(36) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు నల్లప్ప వ్యక్తిగత పని నిమిత్తం శనివారం అనంతపురం పట్టణానికి ద్విచక్రవాహనంలో వెళ్లాడు. శనివారం రాత్రి తిరిగి స్వగ్రామం వస్తుండగా బుక్కచెర్ల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నల్లప్ప తలకు బలమైన గాయం కావడంతో రక్తస్రావమై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నల్లప్పకు భార్య ఇద్దరు కొడుకులు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. నల్లప్ప మృతదేహానికి బండమీదపల్లి, వరిమడుగు టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు మృతుడి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందచేశాడు.



నల్లప్ప (ఫైల్)

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి

● ఆత్మీయ సమావేశంలో ప్రజాప్రతిధుల హామీ



మాట్లాడుతున్న రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

అనంతపురంరూరల్, జూలై 7: వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చేందుకు కృషి చేస్తామని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. ఆదివారం రుద్రంపేటలోని వాల్మీకి కల్యాణమండపంలో వాల్మీకి ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఆలూరు శాసనసభ్యులు విరుపాక్షి, శాసన మండలి సభ్యులు మంగమ్మ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చేందుకు అన్ని విధాలా శ్రమిస్తామన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఇక్కరు, వైసీపీ నుంచి ఒకరు అసెంబ్లీలో ఉన్నామన్నారు. పార్లమెంటు సభ్యులుగా అంబికా లక్ష్మీనారాయణ ఉండటం కార్యాచరణకు మరింత బలాన్ని ఇస్తుందన్నారు. అనంతరం వారిని వాల్మీకి కులస్థులు శాలువా, మెమెంటోలతో సత్కరించారు. అలాగే ఎ.నారాయణపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, కోశాధికారి కిశోర్‌కుమార్, నాయకులు, రమణ, సుధాకర్, జయప్రసాద్, కృష్ణమూర్తి, నరహరి, శ్రీధర్, ఓబులేసు, అంకె ముత్యాలన్న పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులను సన్మానించిన వాల్మీకి సంఘం నాయకులు

బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలి

అనంతపురం కల్చరల్, జూలై 7: వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయ కల్యాణమండపంలో ఐక్యవేదిక నాయకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఐక్యవేదిక నాయకుడు బత్తలపల్లి సత్యరంగారావు మాట్లాడుతూ రాజకీయ నాయకులు బ్రాహ్మణులను కేవలం ఓటుబ్యాంకుగా వాడుకోవడంతోపాటు వారి మేధస్సును తమ స్వార్థాలకు వాడుకోవడం బాధాకరమన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి సంక్షేమానికి పెద్దపీట వేసిందని, తర్వాత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిందని, ఇకనైనా కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని కోరారు. రాజకీయాలతో సంబంధం లేకుండా బ్రాహ్మణులంతా ఐక్యత చాటుకోవాలన్నారు. విశ్రాంత డీఎస్పీలు గిరికుమార్, లక్ష్మయ్య, ఏఎల్ఎన్ శాస్త్రి, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, బద్రీనాథ్, నార్పల మారుతి, సత్యప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బత్తలపల్లి సత్యరంగారావు

నైతికత ప్రబోధకాలు.. నబిరసూల్ సుభాషితాలు

● పుస్తకావిష్కరణ సభలో వక్తలు

అనంతపురం కల్చరల్, జూలై 7: నైతికతను ప్రబోధించే సుభాషితాలు నబిరసూల్ సుభాషితాలని పలువురు వక్తలు అన్నారు. సీనియర్ కవి కంబదూరి షేక్ నబిరసూల్ రచించిన 'నిత్య నవనీతం-నబిరసూల్ సుభాషితం' పుస్తకావిష్కరణ సభను జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఉపాధ్యాయభవన్‌లో నిర్వహించారు. ఆచార్య బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... నబిరసూల్‌తో తనకు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుబంధముందన్నారు. నబిరసూల్ కేవలం సాహిత్యానికే పరిమితమవకుండా ఇతర కళారంగాలతోనూ మమేకమై విశాలమైన సామాజిక జీవితాన్ని ఏర్పరచుకున్నారన్నారు. అనంతరం నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి మాట్లాడుతూ... రోజూ నబిరసూల్ సుభాషితంతోనే రోజు మొదలవుతుందని ఆయన ఎంతో గొప్ప కావ్యాలను, అద్భుతమైన నైతిక విలువలను అందరికీ పంచుతున్నారన్నారు. ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు మాట్లాడుతూ... నబిరసూల్ రచనలు సమాజాన్ని ఎంతో ఆలోచింపజేస్తాయన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అసిస్టెంట్ జిల్లా గవర్నర్ విరూపాక్షిరెడ్డి, త్యాగరాజ గానసభ అధ్యక్షుడు సంపత్‌కుమార్, పర్ ద సొసైటీ వ్యవస్థాపకుడు పోతుల రాధాకృష్ణ, నాగేశ్వరాచారి, పేరిందేవి, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, కోశాధికారి వన్నప్ప, ఉపాధ్యక్షుడు నారాయణస్వామి, కార్యదర్శులు మధురశ్రీ, మురళీకృష్ణ, అంకె శ్రీనివాస్, చం.శాస్త్రి, నానీల నాగేంద్ర, షేక్ రియాజుద్దీన్, జూటూరు షరీఫ్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీకారులు

పశువులకు గర్భకోశ చికిత్స శిబిరం

గార్లదిన్నె, జూలై 7: మండలంలోని పి. కొత్తపల్లి గ్రామంలో పశుసంవర్ధ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ పెయ్యదూడల పుట్టుకను ఉద్దేశించి లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయు పథకం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా గ్రామంలో అన్ని పశువులకు గర్భకోశ పరీక్షలు చేసినట్లు తెలిపారు. రూ.1350 విలువచేసే సూదులను సబ్సిడీతో రూ.500 చెల్లిస్తే ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. రెండు సూదులు వేసి పశువులు కట్టకపోతే రైతు చెల్లించిన నగదును ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందన్నారు. సూదులు వేయిస్తే పశువులు పాలు అధికంగా ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం 39 పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. 22 పశవులకు నట్టలనివారణ మందు తాగించారు. పశువుల్లో పాల శాతం పెరగడానికి పాడి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. జిల్లా పశుగణాభిణవృద్ధి సంస్థ వైద్యులు ఆంజనేయులు నాయక్, పాడి రైతులు పాల్గొన్నారు.



పశువులకు చికిత్సలు చేస్తున్న వైద్యులు

ఉచిత ఇసుక పేదలకు వరం

శింగనమ జూలై 7: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ పేదల ప్రజలకు వరంలాంటిదని మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్ అన్నారు. సోమవారం నుంచి ఉచిత ఇసుక పాలసీ అమలు కానుందని తెలిపారు. వైసీపీ పాలనలో ఇసుక లేక సామాన్య ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారన్నారు. పేదల ఇబ్బందులు గుర్తించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్ ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చి ప్రజలకు మేలు చేశారన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అవుతాయని, కార్మిక వర్గాలకు ఉపాధి లభిస్తుందన్నారు.

నేడు చిరుధాన్యాల వినియోగంపై అవగాహన సదస్సు

రామగిరి, జూలై 7: మండలంలోని పేరూరు గ్రామంలో సోమవారం చిరుధాన్యాల వినియోగంపై శాస్త్రవేత్త ఖాదర్‌వలీ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పాస్ స్వచ్ఛంద సంస్థ సీఈఓరామప్ప, చర సీఈఓ ఎస్కే స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కంబదూరు మండలం కోటగుడ్డం, చెన్నంపల్లి గ్రామాలలో కూడా అవగాహన సదస్సులు ఉంటాయన్నారు. చిరుధాన్యాలు వాడటం వల్ల ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్న అంశంపై వివరిస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం అర్బన్, జూలై 7: నగరంలోని పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ వ్యవసాయ శాఖ అధికారులు ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పాతూరులోని భారతి ఆగ్రో ఏజెన్సీస్, రుద్రంపేటలోని శ్రీ బాలాజీ ఫర్టిలైజర్స్, మానస ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఏడీఏ భాస్కరయ్య, విజిలెన్స్ అధికారి విజయ్‌కుమార్, జేడీఏ ఆఫీస్ టెక్నికల్ ఏఓలు బాలూనాయక్, రాజేష్ నాయక్, అనంతపురం ఏఓ శశికళ తనిఖీలు చేశారు. ఆయా దుకాణాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల స్టాక్, పలు రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో లోపాలను గమనించిన అధికారులు రూ.1.39 లక్షల విలువైన విత్తనాలు, రూ.3.55 లక్షల విలువైన ఎరువులు, రూ.2.62 లక్షలు విలువైన పురుగు మందుల విక్రయాలను నిలుపుదల చేశారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల శాంపిళ్లను ప్రయోగశాలకు పంపించారు.

ప్రభుత్వం మారినా... బోర్డులో మారని పేరు..!

● ఇదీ చంద్రన్న బీమా కాల్ సెంటర్ దుస్థితి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 7: ప్రభుత్వం మారినా... బోర్డులలో మాత్రం పేరు మార్చకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇదివరకు ఉన్న వైఎస్సార్ బీమా కాల్ సెంటర్‌ను... చంద్రన్న బీమా కాల్ సెంటర్‌గా మార్చాలని ఇప్పటికే నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం ఆదేశించింది. అయినా డీఆర్‌డీఏ-వైకేపీకి అనుబంధంగా ఉన్న బీమా కాల్ సెంటర్ అధికారులు మాత్రం అలాగే ఉండిపోయారు. కార్యాలయానికి వైఎస్సార్ బీమా కాల్ సెంటర్‌పై రంగు దిద్దారు. చంద్రన్న బీమా కాల్‌సెంటర్ అనే పేరు మాత్రం రాయలేదు. ఎన్నికలకోడ్‌తో... గత మార్చి 16వతేదీన బీమా కాల్ సెంటర్ లాగిన్‌ను క్లోజ్ చేశారు. ఇక అప్పటి నుంచి కొత్త దరఖాస్తులు తీసుకోవడం లేదు. మొత్తం ఇప్పటి వరకు 13545 మంది అభయహస్తం కింద దరఖాస్తు చేసుకోగా, 12050మంది నెలకు రూ.500 చొప్పున పింఛన్ అందిస్తున్నారు. వీరిలో 584మంది మరణించారు. 784మంది తాత్కాలికంగా వలస వెళ్లారు. బీమాకోసం 1060మంది దరఖాస్తు చేసుకోగా, 909 మందికి సాధారణ మరణం కింద రూ.లక్ష చొప్పున అందజేశారు. మిగిలిన 26 మంది దరఖాస్తులు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. 125 మంది ప్రమాదంలో మృతి చెందిన బాధిత 68 కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున చెల్లించారు. మిగిలిన 57 మందికి పెండింగ్‌లో ఉంచారు. దీనిపై బీమా కాల్‌సెంటర్ ఏపీఎం నారాయణస్వామిని వివరణ కోరగా పేరు మార్చాలని ప్రభుత్వం జీఓ ఇచ్చిందని, త్వరలో పేరు మారుస్తామని తెలిపారు. లాగిన్ క్లోజ్ కావడంతో చెల్లింపులు ఆగాయని... ఓపెన్ చేసిన వెంటనే బాధిత కుటుంబాలకు చెల్లిస్తామని తెలిపారు.



బీమా కార్యాలయానికి పేరు మార్చని దృశ్యం

ముష్కిన్ ఆశయాలను కొనసాగిస్తాం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



ముష్కిన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పీపీఎం, సీపీఐ నాయకులు

అనంతపురం కల్చరల్, జూలై 7: సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కామ్రేడ్ ముష్కిన్ ఆశయాలను కొనసాగిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. ఇటీవల మృతిచెందిన ముష్కిన్‌కు సంతాపంగా నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి అధ్యక్షతన గుత్తిరోడ్డు ఐదులైట్ల సర్కిల్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సంతాపసభకు రాంభూపాల్, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సుబహాన్, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, కేవీ రమణ, ఇన్సాఫ్ నాయకుడు బంగారు బాషా, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు వలి హాజరై ముష్కిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ... ముష్కిన్ ఆవాజ్ కమిటీలో చురుకైన పాత్ర వహిస్తూ, ముస్లిం మైనార్టీల హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి ఎనలేని పోరాటాలు సాగించాడని అన్నారు. ఎన్ఆర్‌సీ, సీఏఏ చట్టాల రద్దుకోసం నిర్వహించిన పోరాటంలో విశేష కృషి చేశాడని గుర్తుచేశారు. ముష్కిన్ మృతి సీపీఎంకు తీరని లోటని పేర్కొన్నారు. పేదలు, కార్మికులు, కర్షకులకోసం సీపీఎం చేసిన పోరాటాల్లో ముష్కిన్ తనదైన పాత్ర పోషించాడన్నారు. పేదల ఇళ్లస్థలాలకోసం, కాలనీల్లో సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన పోరాటాలు మరవలేనివని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నగర కమిటీ సభ్యులు ప్రకాష్‌రెడ్డి, రామాంజి, రాజు, వెంకటేష్, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజినమ్మ, ఆవాజ్ నాయకుడు నూరుల్లా, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీసీ సంక్షేమ అధికారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 7: అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటాలన్న కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపుమేరకు బీసీ సంక్షేమశాఖాధికారులు నగరంలోని పలు వసతిగృహాల్లో మొక్కలు నాటారు. ఆదివారం నగరంలోని బీసీ బాలికల వసతిగృహంలో డీడీ కుష్బూకొఠారీ, జిల్లా ఎల్‌డీఓ అధికారిని ఓబులమ్మ, ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి, వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మస్తాన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. డీడీ మాట్లాడుతూ కలెక్టర్ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని ఒక వ్యక్తికి దత్తత ఇస్తూ ప్రమాణం చేయిస్తుండటం శుభపరిణామమన్నారు. అనంతర వసతిగృహంలో విద్యార్థులు సౌకర్యార్థం లైబ్రరీని ప్రారంభించారు. విద్యార్థులు పుస్తకాలను వినియోగించుకొని చక్కగా చదువుకోవాలన్నారు. వార్డెన్ల సంఘం గౌరవాధ్యక్షుడు మారుతీప్రసాద్, వార్డెన్ మాధవీలత, విద్యార్థినులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరుపోస్తున్న డీడీ కుష్బూకొఠారీ, అధికారులు

నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం



సి.బండమీదపల్లిలో ఎరువుల తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

శింగనమల, జూలై 7: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చిత్తూరు వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం భాస్కరయ్య అన్నారు. ఆదివారం మండలంలోని సి.బండమీదపల్లి గ్రామంలోని స్వర్ణభూమి ఫర్టిలైజర్స్ ఎరువుల కర్మాగారాన్ని డిప్యూటీ డైరెక్టర్ భాస్కరయ్య, విజిలెన్స్ అధికారి విజయ్‌కుమార్ కర్మాగారాన్ని తనిఖీ చేశారు. కర్మాగారంలో లైసెన్స్ ఎరువులు మెటీరియల్, ఎరువుల తయారీని, ల్యాబ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు ఇవ్వాలని, తయారు చేసిన ఎరువుల వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేయాలన్నారు. ఏవోలు బాలనాయక్, అన్వేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

శింగనమల జూలై 7: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామాలయంలో వద్ద ఆదివారం ఎమ్మార్పీఎస్ జెండాను సంఘం జిల్లా కార్యదర్శి చిన్నజలాలపురం ఓబిలేసు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛన్లు రూ.6 వేలు పెంచేందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చేసిన కృషి అభినందనీయమన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. జిల్లా నాయకులు చంద్ర, వెంకటేశ్, నారాయణస్వామి, సాయి పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

హైకోర్టులో అర్చకులకు ఊరట

రాయదుర్గంరూరల్, జూలై 7: మండలంలోని మెచ్చిరి గ్రామంలో గల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు జరుపుకునేందుకు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ విషయాన్ని గ్రామంలో ప్రజలకు సమా చారాన్ని అందించి ఆలయంలో పూజలు జరపాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. దీంతో అర్చకులు తిరిగి అర్చకత్వానికి హాజరయ్యారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ మాన్యం భూమి 25.40 ఎకరాల ఉంది. కాగా అందులో పంటలు సాగుకు మూడేళ్ల క్రితం అర్చకులు వ్యవసాయ అధికారులతో కలిసి కౌలురైతుల కింద పేర్లను నమోదు చేసుకున్నారు. దీనికి స్థానికులు కొందరు అభ్యంతరం తెలిపారు. దీంతో అర్చకులు కోర్టుకు వెళ్లి అప్పటి నుంచి అర్చకత్వానికి కూడా దూరంగా ఉన్నారు. అప్పట్లో దేవాదాయశాఖ వారు పంచాయతీలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇప్పుడు అర్చకులకు సానుకూలంగా తీర్పు రావడంతో వారు పూజలు మొదలుపెట్టారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

గుత్తి, జూలై 7: సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలో బీసీ, ఎస్సీ హాస్టళ్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టళ్లలో అనేక సమస్యలు నెలకొన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని అన్నారు. అలాగే విద్యార్థులకు ఏడు నెలల మెస్, కాస్మొటిక్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనాలను మరమ్మతులు చేయాలన్నారు. సీజన్ వ్యాధులకు హాస్టల్‌లో మెడికల్ క్యాంపు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీ, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బీసీ డీఎన్‌టీ హాస్టల్‌లో సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బీసీ డీఎన్‌టీ హాస్టల్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదివారం సందర్శించారు. హాస్టల్లో సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గత ఏడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలి, శిథిలావస్థలో ఉన్న సంక్షేమ హాస్టళ్ల భవనాలను మరమ్మతులు చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకీ, కిషోర్, జయరాం పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

బెళుగుప్ప, జూలై 7: మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో యువతి అదృశ్యంపై తల్లిదండ్రులు కృష్ణయ్య, నాగవేణిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రామదాసు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన కొందరిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ కార్యకర్త మృతి

కూడేరు, జూలై 7: మండలంలోని ముద్దలాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వలీసాబ్ (32) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ మండల నాయకులు ఆ గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యుల్ని పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. మృతుడికి భార్య ఖాజాబీ, కుమార్తె రిజ్వానా ఉన్నారు.

ఎనిమిది మందిపై కేసు

పుట్లూరు, జూలై 7: మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన ఘర్షణ కేసులో ఇరువర్గాలకు సంబంధించి 8మందిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ హేమాద్రి ఆదివారం తెలిపారు. పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాలు కొట్టుకున్నట్లు చెప్పారు. మంజుల రాజుతోపాటు మరో ముగ్గురు, మరో వర్గంలో మంజుల నవీన్‌తోపాటు ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. గ్రామంలో సీఐ సుబ్రహ్మణ్యం పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కుక్కలకు టీకా వేయించండి

తాడిపత్రి, జూలై 7: పట్టణ, మండలవ్యాప్తంగా కుక్కలను పెంచుకుంటున్న వారు తప్పనిసరిగా వాటికి రేబిస్ టీకా వేయించాలని మండల పశువైద్యాధికారి హరిక్రిష్ణ తెలిపారు. ఈ టీకా వేయించడం వల్ల అవి కరిచినప్పటికీ ఎవరికీ ఎలాంటి అపాయం ఉండదన్నారు. ప్రతి ఒక్కరూ తమ పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని ఆయన సూచించారు.

గ్రామపెద్దలకు తాళాల అప్పగింత

కణేకల్లు, జూలై 7: మండలంలోని ప్రసిద్ధిచెందిన హనుమాపురం లాలూస్వామి పీర్ల మకానం తాళాలను తహసీల్దార్ సమక్షంలో గ్రామపెద్దలకు అప్పగించారు. గతంలో ఆలయ తాళాలు వైసీపీ నాయకుల చేతిలో ఉండేవి. ఇప్పుడు వాటిని వారు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం తహసీల్దార్ ఇంద్రాదేవి సమక్షంలో గ్రామసర్పంచ్ జయరాంచౌదరి, టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు నరేంద్రతోపాటు మిగతా గ్రామపెద్దలకు అందించారు. టీడీపీ నాయకులు రామచంద్రప్ప, దేవదాసు, రఘురామచౌదరి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో అర్చకులకు ఊరట

రాయదుర్గంరూరల్, జూలై 7: మండలంలోని మెచ్చిరి గ్రామంలో గల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు జరుపుకునేందుకు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ విషయాన్ని గ్రామంలో ప్రజలకు సమాచారాన్ని అందించి ఆలయంలో పూజలు జరపాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. దీంతో అర్చకులు తిరిగి అర్చకత్వానికి హాజరయ్యారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ మాన్యం భూమి 25.40 ఎకరాల ఉంది. కాగా అందులో పంటలు సాగుకు మూడేళ్ల క్రితం అర్చకులు వ్యవసాయ అధికారులతో కలిసి కౌలురైతుల కింద పేర్లను నమోదు చేసుకున్నారు. దీనికి స్థానికులు కొందరు అభ్యంతరం తెలిపారు. దీంతో అర్చకులు కోర్టుకు వెళ్లి అప్పటి నుంచి అర్చకత్వానికి కూడా దూరంగా ఉన్నారు. అప్పట్లో దేవాదాయశాఖ.. పంచాయతీలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇప్పుడు అర్చకులకు సానుకూలంగా తీర్పు రావడంతో వారు పూజలు మొదలుపెట్టారు. జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, అర్చకులు, సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు

కుందుర్పి, జూలై 7: మండలంలోని ఓ గ్రామంలో మహిళపై లైంగిక దాడికి యత్నించిన కొత్తూరు రంగనాథ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. రెండురోజుల క్రితం సాయంకాలం బహిర్భూమికి వెళ్లిన మహిళపై రంగనాథ్ లైంగిక దాడికి యత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో అతడు భయపడి పారిపోయాడు. ఆ మహిళ కుటుంబ సభ్యులతో విషయాన్ని చెప్పింది. వారు బయటికి తెలిస్తే కుటుంబ పరువు పోతుందని భావించారు. కొంతకాలంగా రంగనాథ్.. ఆ మహిళ వెంటపడి వేధిస్తుండేవాడు. చివరకు ఆమె కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా పవన్ యాదవ్

కళ్యాణదుర్గంరూరల్, జూలై 7: బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా పవన్ యాదవ్ నియమితుడయ్యారు. ఈ మేరకు అసెంబ్లీ కన్వీనర్ ముప్పూరి దేవరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పవన్ యాదవ్ మాట్లాడుతూ.. బీజేపీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా చర్యలు

● డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించిన ఎమ్మెల్యే కాలవ



ప్రధాన డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తదితరులు

రాయదుర్గంటౌన్, జూలై 7: వర్షాకాలంలో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు వరద ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ప్యాలెస్ రోడ్డులో ఉన్న ప్రధాన డ్రైనేజీవ్యవస్థను ఆదివారం ఆయన మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. నేటి నుంచి ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్‌ను ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాలు కురిసిన ప్రతిసారి లోతట్టు ప్రాంతాల ప్రజలు చినుకుపడితే కునుకు లేకుండా ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మురుగుకాలువల్లో సగానికిపైగా పూడిక పేరుకుపోయిందని, దీంతో మురుగునీరు కాలువల సామర్థ్యం తగ్గి వర్షపునీరు సక్రమంగా పారడం లేదని, నీరు గృహాల్లో, వాణిజ్య దుకాణాల్లో చేరుతున్నాయని, ఫలితంగా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. దీనిపై గత శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించామన్నారు. మురుగుకాల్వల్లో పూడిక తీయించి వాటి సామర్థ్యాన్ని పెంచి వర్షపునీరు సక్రమంగా పారే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ టంకశాల హనుమంతు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్లు నల్లపూల వెంకటేశులు, కడ్డిపూడి మహబూబ్‌బాషా, టీడీపీ నాయకుడు జిలాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా హెచ్చెల్సీ యూటీ మరమ్మతులు



వేగంగా సాగుతున్న పనులు

బొమ్మనహాళ్: డీ.హీరేహాళ్ మండలం చెర్లోపల్లి సమీపంలోని హెచ్చెల్సీ 119/600 కిలోమీటర్ వద్ద ఇటీవల కురిసిన వర్షానికి అండర్‌టన్నెల్ ఛానల్ కుంగిపోయిన విషయం తెలిసిందే. ఈ సమస్యను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి అత్యవసర మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారు. దీంతో యూటీ పనులు శరవేగవంగా జరుగుతున్నాయి. తుంగభద్ర జాశయానికి వరదనీరు పెరుగుతుండడంతో నీరు సకాలంలో రావచ్చని అధికారులు ముందుగా యూటీ పనులను వేగవంతంతో చేయిస్తున్నారు. 112వ కి.మీ వద్ద కూడా కాలువ గట్టుకు గండిపడడంతో మరమ్మతు పనులను దాదాపుగా పూర్తి కానిచ్చారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చొరవతో హెచ్చెల్సీ అత్యవసర పనులు శరవేగంగా జరుగుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ పాలనలో హెచ్చెల్సీ పనులపై ఎవరూ కూడా ఏ మాత్రం శ్రద్ధ పెట్టలేదని వారు విమర్శిస్తున్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

● ఖాళీబిందెలతో రాస్తారోకో



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

ఉరవకొండ, జూలై 7: తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మహిళలు స్థానిక గుంతకల్లు-ఉరవకొండ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఖాళీ బిందెలతో బైఠాయించి నిరసన తెలిపారు. తమ గ్రామంలోని 4, 5వ వార్డులలో 10 రోజుల నుంచి తాగునీరు సరఫరా కావడం లేదని వాపోయారు. దీంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని అన్నారు. సమస్యను అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. అందుకే రాస్తారోకోకు దిగామన్నారు. రాస్తారోకోతో గుంతకల్లు- ఉరవకొండ రహదారిలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరేష్ అక్కడికి చేరుకుని ఆందోళన విరమించాలని సూచించారు. సమస్య పరిష్కారమయ్యేవరకూ విరమించే ప్రసక్తేలేదని భీష్మించుకుకూర్చున్నారు. ఎస్ఐ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడించారు. సమస్యను పరిష్కరిస్తామని వారు హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

● కాపర్‌ను అపహరించిన దొంగలు



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

కళ్యాణదుర్గం (కంబదూరు), జూలై 7: కంబదూరు మండలం కుర్లపల్లిలో ఊరి బయట 24 గంటలు విద్యుత్ సరఫరా చేసే 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కాగా ఆ ట్రాన్స్‌ఫార్మర్ కిందకు పడి ధ్వంసమై ఉండడంతో గమనించిన రైతులు ఆదివారం ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దొంగలు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులో ఉన్న కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఇందులో 16 కేజీల కాపర్ వైర్ ఉంటుందని, దాని విలువ రూ.15 వేలు వరకు ఉంటుందని అంచనా వేశారు. తర్వాత ట్రాన్స్‌కో అధికారులు కంబదూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

డీ.హీరేహాళ్, జూలై 7: మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలోగల హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఘటనపై ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బళ్లారికి చెందిన మహబూబ్‌బాషా(22), అతని స్నేహితుడు అనిల్‌కుమార్ ఆదివారం బైక్‌పై షికారు కోసం ఓబుళాపురం గ్రామానికి వచ్చారు. కొద్దిసేపు అనంతరం తిరిగి బళ్లారికి బయలుదేరారు. ఓబుళాపురం గ్రామ సమీపంలో ఉన్న బళ్లారి - బెంగుళూరు హైవేలో మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడిపోయింది. ప్రమాదంలో మహబూబ్‌బాషా బాషాకు తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. అనిల్‌కుమార్‌కు తీవ్రగాయాలవడంతో స్థానికులు 108 వాహనంలో బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహబూబ్‌బాషా మృతదేహాన్ని కూడా ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



రాయదుర్గంలో ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాయదుర్గంరూరల్: జూలై 7: పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టవర్‌క్లాక్ వద్ద ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించి మాదిగల అమరవీరులను స్మరిస్తూ ఐదు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఏబీసీడీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అనేక పోరాటాలు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కేక్‌ను కట్ చేసి పంచారు. చర్మకారులకు సన్మానం చేశారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లిపాయల ఆనంద్, నాయకులు అరుణ్‌కుమార్, బబ్లు, సూరి, కిరణ్, వెంకటేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో నాయకురాలు సునీత, సూరి, అంజి, పద్మావతి, జిల్లా నాయకులు వీరన్న, కృష్ణప్రసాద్, సత్యనారాయణ, నాగరాజు, ఓబులేసు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఉరవకొండ : పట్టణంలో ఆదివారం ఎమార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు స్థానిక పాత బస్టాండ్‌లోని మాదిగల అమరవీరుల స్థూపం వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కౌకుంట్ల రవి, చెన్నప్ప, సురేష్, వెంకటేశులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

గుత్తిలో ఒకరికి తీవ్రగాయాలు

గుత్తి, జూలై 7: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకెళ్తే.. మండలంలోని కరిడికొండ గ్రామానికి చెందిన రాజశేఖర్ బైక్‌పై అనంతపురం వైపు గుత్తికి వస్తున్నారు. కాగా రవితేజ హోటల్ సమీపంలో ఎదురుగా మరో బైక్ వేగంగా రావడంతో అదుపు తప్పి ఆ రెండు బైక్‌లు పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో రాజశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

పశువులకు ముద్దచర్మవ్యాధి నివారణ టీకాలు

బ్రహ్మసముద్రం, జూలై 7: మండలంలోని పాల వెంకటాపురం గ్రామంలో ఆదివారం పశువుల్లో ముద్దచర్మ వ్యాధి నివారణకు డాక్టర్ నవీన్ ఆధ్వర్యంలో పశుసంవర్ధక సహాయకులు సుధీర్‌కుమార్, లింగన్న గౌడ్, సహాయక సిబ్బంది టీకాలు వేశారు. ఇందులో గ్రామ రైతులు పాల్గొన్నారు.

పేరుకే 24 గంటల ఆస్పత్రి

● పనిచేసేది 7 గంటలే

● రెండేళ్ల క్రితం పనివేళలను పెంచినా.. గోప్యంగా ఉంచిన వైద్యులు, సిబ్బంది

● శ్రీధరఘట్ట ప్రాథమిక వైద్యశాలలో ఇదీ దుస్థితి



సాయంత్రానికే మూతపడిన ఆస్పత్రి తలుపులు

బొమ్మనహాళ్, జూలై 7: గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక వైద్యశాలల్లో 24 గంటలు సేవలు అందించాల్సి ఉంది. అలా చేయాలని రెండేళ్ల క్రితమే ఆదేశాలు జారీ అయ్యాయి. మండలంలోని శ్రీధరఘట్ట ప్రాథమిక వైద్యశాలలో సిబ్బంది 24 గంటల సర్వీసును పెంచిన విషయాన్ని గోప్యంగా ఉంచారు. సాయంత్రం 4 గంటలకే ఆస్పత్రి తలుపులు మూసేసి ఎవరిదారిన వారు వెళ్లిపోతున్నారు. ఆ ఆస్పత్రిలో 24 గంటలు సేవలు అందించాల్సి ఉంది. వైద్యులు, సిబ్బంది కేవలం ఏడు గంటలే సర్వీసు అందించి ఆ తర్వాత వెళ్లిపోతున్నారు. అక్కడ ఇద్దరు వైద్యాధికారులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, తగినంత సిబ్బంది ఉన్నారు. నర్సులు, సిబ్బంది ఉదయం 10 గంటలకు వచ్చి సాయంత్రం నాలుగు గంటలకల్లా వెళ్లిపోతున్నారు. వైద్యాధికారులు మాత్రం విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, సకాలంలో వైద్యం అందించలేకపోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. 24 గంటలు సేవలు అందించాల్సిన ఆసుపత్రిని నాలుగు గంటలకే మూతవేస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై డీఎంఅండ్‌హెచ్‌ఓను వివరణను కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఇసుక డంప్ పరిశీలన



ఇసుక డంప్ వద్ద ఆర్డీఓ సుస్మితరాణి

రాయదుర్గం రూరల్, జూలై 7: మండలంలోని జుంజురంపల్లి గ్రామ సమీపంలోని వేదావతినది వద్ద గల ఇసుకరీచ్‌లో ఏర్పాటు చేసిన ఇసుక డంప్‌ను ఆర్డీఓ సుస్మితరాణి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక పంపిణీ చేయనున్న నేపథ్యంలో ఇసుకడంప్‌ను పరిశీలించినట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వం ఈ నెల 8 వ తేదీ నుంచి ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయనుండడంతో అవసరమైన ప్రతిఒక్కరికీ ఇసుకను అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. లోడింగ్‌తో పాటు ఒక టన్నుకు రూ.195 వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం జుంజురంపల్లి వద్ద 58 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఓ ప్రభాకర్‌రావు, తహసీల్దార్ చిట్టిబాబు, సర్పంచ్ అశోక్‌కుమార్, వీఆర్వో భీమప్ప, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డిని కలిసిన కాంట్రాక్ట్ కార్మికులు

తాడిపత్రి, జూలై 7: ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డిని పట్టణంలోని ఆయన నివాసంలో ట్రాన్స్‌కో కాంట్రాక్ట్ కార్మికులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శీనయ్య కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్మికులు సయ్యద్‌వలి, నజీర్‌అహ్మద్, అనిల్‌కుమార్‌రెడ్డి, ఉపేంద్ర తదితరులు ఉన్నారు.

ఫర్టిలైజర్స్ డీలర్ల సంఘం మండల కమిటీ ఎన్నిక



చాంద్‌బాషా అధ్యక్షుడు



శరత్‌చంద్ర ఉపాధ్యక్షుడు

కణేకల్లు, జూలై 7: ఫర్టిలైజర్స్ డీలర్ల సంఘం మండల నూతన కమిటీని ఆదివారం మండలకేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా మహేష్‌గుప్తా, అధ్యక్షుడిగా చాంద్‌బాషా, ఉపాధ్యక్షుడుగా శరత్‌చంద్ర, కార్యదర్శిగా తుకారం, జాయింట్ సెక్రెటరీగా అరుణాచలంతో సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు.

పొలంలో పైపులు ధ్వంసం



ధ్వంసమైన పైపులను పరిశీలిస్తున్న ఎస్ఐ

పెద్దవడుగూరు, జూలై 7: మండలంలోని చింతలచెరువు గ్రామానికి చెందిన రైతు మహేశ్వర్‌రెడ్డి పొలంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు పైపులను ధ్వంసం చేశారని ఎస్ఐ రెడ్డప్ప తెలిపారు. వేరుశనగ పంట సాగు కోసం రైతు పైపులను ఏర్పాటు చేశాడు. కాగా శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఆ పైపులను కోసి ధ్వంసం చేశారు. ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతు ధ్వంసమైన పైపులను గమనించాడు. దీంతో లక్ష రూపాయల మేర నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.

కళ్యాణదుర్గంలో కేపీఎల్ క్రికెట్ టోర్నీకి సన్నాహాలు

● చిక్కప్ప ప్రభుత్వ పాఠశాల మైదానం పరిశీలన



మైదానాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం, జూలై 7: క్రీడారంగంలో నూతనోత్సాహం నింపడానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కేపీఎల్ పేరుతో పట్టణంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రత్యేక బృందం స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్‌ను ఆదివారం పరిశీలించారు. క్రీడాభిమానులు దాదాపు ఐదు వేల మంది కూర్చోవడానికి డీజే, లైవ్ స్టేజ్, యుట్యూబ్ లైవ్, రాత్రి సమయంలో ఆడటానికి ఆధునాతన లైట్లు అమర్చడానికి పరిశీలించారు. కళ్యాణదుర్గం చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో టోర్నీ నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే కీడ్రా స్ఫూర్తి పట్ల క్రీడా అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొదటి ప్రైజ్ కింద రూ. రెండు లక్షలు, ద్వితీయ బహుమతి రూ.లక్ష, తృతీయ బహుమతి రూ.50 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు 8790123265, 7780543388, 9986119992 నంబర్లలో సంప్రదించాలన్నారు. దరఖాస్తులు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే ప్రజావేదిక వద్ద అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

కూలడానికి సిద్ధంగా ప్రహరీ



కూలడానికి సిద్ధంగా ఉన్న ప్రహరీ

కుందుర్పి, జూలై 7: మండలంలోని జంబుగుంపల గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు ఇటీవల నాడు నేడు పనుల కింద వైసీపీ నాయకులు ప్రహరీ నిర్మించారు. అయితే ప్రాథమిక పాఠశాలకు అంగన్‌వాడీ కేంద్రానికి మధ్య ఈ ప్రహరీ నిర్మాణాన్ని నాసిరకంగా చేపట్టారు. దీంతో అది అప్పుడే బీటలు వారి కూలడానికి సిద్ధంగా ఉంది. అటు పాఠశాల విద్యార్థులు ప్రహరీ పక్కనే ఉన్న అంగన్‌వాడీ చిన్నారులు భయం గుప్పిట్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని కూలడానికి సిద్ధంగా ఉన్న ప్రహరీకి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సిమెంట్ రోడ్డుపై వర్షపు నీటి నిల్వ

● డ్రైనేజీలు లేకపోవడంతోనే సమస్య



ఇటీవల వర్షానికి సీసీ రోడ్డుపై నిలిచిన నీరు

గుత్తి, జూలై 7: పట్టణంలోని ఆర్ఎస్‌లోగల మూడో వార్డులో నిర్మించిన సీసీ రోడ్డు చిన్న పాటి వర్షం పడినా నీరు నిలిచి చెరువులా మారుతోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలల క్రితం రవూఫ్ దర్గాకు వెళ్లే దారిలో రూ. లక్షలు వెచ్చించి గత ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్డు నిర్మించారు. అయితే రోడ్డును హెచ్చుతగ్గులుగా వేశారు. డ్రైనేజీలను ఒక పక్క చిన్నపాటిగా నిర్మించారు. మరోపక్క అసలు నిర్మాణమే చేపట్టలేదు. విద్యుత్ స్తంభం అడ్డు ఉండటంతో ఓ పక్క డ్రైనేజీ నిర్మాణాన్ని అధికారులు చేపట్టలేదు. ఆ స్తంభం ఓ వైసీపీ నేత ఇంటి వద్ద ఉండడంతో దానిని మార్చకూడదని ఆయన అధికారులను హెచ్చరించారు. దీంతో వారు దానిని తొలగించలేకపోయారు. మొయిన్ బజారు నుంచి వచ్చే వర్షపు నీరు ఈ కాలనీ వద్దకు వచ్చి చేరి రోడ్డుపై నిలుస్తోంది. వెళ్లడానికి డ్రైనేజీలు లేకపోవడంతో అలాగే నిలిచిపోతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు విద్యుత్‌స్తంభాన్ని మార్చి, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.